ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 10 | జూలై | 2024
పేజీలు 8

## పాల్వంచ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు



- రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కూనంనేని
- పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకునేది లేదు

2లో

# బదిలీలు సరే.. బకాయిల సంగతేంటి..?

-పంచాయతీ కార్యదర్శుల్లో గుబులు
-ఏడాదిగా పంచాయతీలకు రాని నిధులు
-రోజు వారి నిర్వహణకు అప్పులు







ప్రజాపక్షం/ ఖమ్మం : పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్యం సహా గ్రామ పంచాయతీలలో దైనందిన కార్యక్రమాల నిర్వహణ భారంగా మారింది. గ్రామ పంచాయతీల పాలక వర్గం ఈ ఏడాది జనవరి 30 తో ముగియటంతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాలన సాగుతుంది. గత ప్రభుత్వంలోనే గత ఏడాది మే నుండి పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పుడు అదే పరిస్థితి. పారిశుధ్యం, వీధి దీపాలు, ట్రాక్టర్ల సహా పలు ఖర్చులను గ్రామ పంచాయతీ కార్యదర్శులే చెల్లిస్తూ వస్తున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తాము ఖర్చు చేసినవి తీసుకోవచ్చునని

మిగతా 2లో..

## 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యం



-త్వరలో ట్రయల్ రన్
-పూసగూడెం పంప్ హౌజ్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. కృష్ణా జలాలు అనుకున్న సమయానికి శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు రాకపోయినా వైరా ప్రాజెక్టు, సాగర్ ప్రాజెక్టు చుట్టూ ఉన్న ఆయకట్టుతో పాటు మధ్యలో

మిగతా 2లో..

## ఫీజుల దోపిడీని అరికట్టాలి




-ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి
-ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి
-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఛలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళనతో కొంత సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో

మిగతా 2లో..

# బదిలీలు సరే.. బకాయిల సంగతేంటి..?

**(మొదటిపేజీ తరువాయి)** భావించారు. ఇప్పుడు ఐదేండ్లుగా గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన వారిని బదిలీ చేయనున్నట్లు ప్రకటించింది. పెద్ద మొత్తంలో తమ సొంత నిధులు ఖర్చు చేసిన కార్యదర్శులు బెంబేలెత్తి పోతున్నారు. ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీలలో కార్యకలాపాలు కుంటుపడకూడదన్న ఆదేశాలతో కార్యదర్శులు ప్రభుత్వ కార్యక్రమాలను పంచాయతీలలో నిర్వహించారు. జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు వాడిన డీజిల్ బకాయి పది లక్షలు పెట్రోల్ బంక్‌లో బకాయి ఉండగా పంచాయతీ నుంచి రెండు బ్యాంకు చెక్కులు ఇచ్చినా ఫలితం లేకపోయింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి చెల్లించాలని బంక్ యజమాని ఒత్తిడి తెస్తున్నారు. బదిలీపై ప్రస్తుత కార్యదర్శి బదిలీపై వెళితే త మ బకాయి సంగతేంటని నిలదీస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో మైనర్ పంచాయతీ కార్యదర్శి కూడా దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. గ్రామ పంచాయతీలు నిధులు లేక నిరస పడిపోతున్నాయి. ఇప్పుడు నిధులు విడుదలైన తాజా మాజీ సర్పంచులకు బిల్లుల చెల్లింపుకే సరిపోతాయని ఈ పరిస్థితులలో బకాయిల భారీ నుండి గట్టేక్కేదెలా అని కార్యదర్శులు మదన పడుతున్నారు. గ్రామ పంచాయతీలలో పని చేసే సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించ లేదు. వర్షాకాలం రావడంతో పారిశుధ్య పనులు చేపట్ట డం, ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలింపు కార్యదర్శులకు భారంగా మారింది. దేశాభివృద్ధి గ్రామాల అభివృద్ధి తోనేనన్న నానుడి విధితమే. నిధులు లేకపోతే పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం సాధ్యం కాదు అన్న విషయం ప్రభుత్వ పెద్దలకు తెలియనిది కాదు గ్రామ పం చాయతీ కార్యదర్శుల బదిలీలకు ముందే గ్రామ పంచాయతీలకు కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాల్సి ఉంది. లేదంటే గ్రామాలలో అభివృద్ధి కుంటుపడి ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడతాయి.

## 10 లక్షల ఎకరాలకు

# సాగునీటిని అందించడమే లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)**



ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికి గోదావరి జలాలను పంపించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని మంత్రి తెలిపారు. మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పివో రాహుల్ తో కలిసి ముల్కలపల్లి మండలం పూసగూడెం వద్ద పంప్ హౌజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పంపు హౌజ్‌లో చేపట్టిన పనుల వివరాలు మ్యాప్ ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరించారు. ట్రయల్ రన్‌కు సిద్దంగా ఉన్న మోటర్లను మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంప్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన మోటర్లు చైనా షాంగై కంపెనీ రూపొందించినవని తెలిపారు. చైనా నుండి ఆ కంపెనీ ఇంజనీర్లు రావాల్సి ఉందని వచ్చిన అనంతరం పంప్ హౌజ్ ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో చైనా ఇంజనీర్లు రావడానికి భారత ప్రభుత్వం, చైనా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. పంప్ హౌజ్‌లో ఇరిగేషన్, ఎలక్ట్రికల్ పనులన్ని పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మోటర్లు చైనా కంపెనీవి అయినందున వారి ఇంజనీర్ల సమక్షంలోనే ట్రయల్ రన్ పూర్తి చేసుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆగష్టు నెలలో గోదావరి జలాలు ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. కృష్ణా జలాలు అనుకున్న సమయానికి శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు రాకపోయినా వైరా ప్రాజెక్టు, సాగర్ ప్రాజెక్టు చుట్టూ ఉన్న ఆయకట్టుతో పాటు మధ్యలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికి గోదావరి జలాలను పంపించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. పూసగూడెం వద్ద పంప్ హౌజ్‌లో పంపులు బిగించి నాలుగేళ్లు పూర్తయిందని ఈ ఏడాది తప్పనిసరిగా ట్రయల్ రన్ పూర్తి చేయాలని లేని పక్షంలో ప్రమాదం ఉంటుందని నిపుణులు సూచించారని తెలిపారు. ట్రయల్ రన్ పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. జూలూరుపాడు టర్నల్ పూర్తయ్యే లోపు గోదావరి జలాలను వాడుకుంటూ పంప్ హౌజ్‌లను వినియోగంలోకి తీసుకు రావాలని ఆ పంపులు చెడి పోకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏన్కూర్ టర్నల్ లింక్ కెనాల్‌ను అత్యవసర ప్రాతిపదిక పైన ముఖ్యమంత్రి సహకారంతో ఈనెలలో పూర్తి చేయబోతున్నామని తెలిపారు. టర్నల్ వరకు 104 కిలో మీటర్ల కెనాల్ 97 శాతం పూర్తయిందని, మూడు శాతం లైనింగ్ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గోదావరి జలాలతో మూడు పంపు హౌజ్‌లను వినియోగించుకోవడంతో పాటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు మీడియం ప్రాజెక్టులైనా వైరా లంకా సాగర్‌కు ఈ ఏడాది గోదావరి జలాలను తరలిస్తామన్నారు. వచ్చే సీజన్ నాటికి యాతాలకుంట టర్నల్ పనులు పూర్తి చేసి సత్తుపల్లి నియోజక వర్గంతో పాటు అశ్వారావుపేట నియోజక వర్గానికి కూడా సాగునీటిని అందిస్తామని తెలిపారు. రూ. 7,800 కోట్లతో పంపు హౌజ్ నిర్మాణం చేపట్టామని దీనిని వినియోగంలోకి తేవడంతో పాటు జూలూరుపాడు టర్నల్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరుకు చేరుస్తామని తెలిపారు. మున్నేరు, ఆకేరు మీద టర్నల్ పనులు జరుగుతున్నాయన్నారు. జూలూరుపాడు టర్నల్ పనులు పూర్తి చేయాలని అందుకు 10 కిలో మీటర్ల ఫారెస్టు అనుమతి తీసుకు రావాల్సి ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో సుమారు ఏడు లక్షల ఎకరాలకు, నాగార్జున సాగర్ ఆయకట్టు మూడు లక్షల ఎకరాలకు మొత్తం 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే ప్రజల, నా కోరిక అని మంత్రి తెలిపారు. ఇల్లందు నియోజక వర్గానికి గోళ్లపాడు నుంచి నీటిని అందించడం సాధ్యం కాలేదని అటవీ అనుమతులు లభించకపోవడం వల్ల సాధ్యపడలేదన్నారు. ప్రత్యేకంగా దృష్టిసారించి గోదావరి జలాలను ఇల్లందు నియోజక వర్గానికి తరలిస్తామన్నారు. ఈ నెలలోనే మూడు పంపు హౌజ్‌ల ట్రయల్ రన్ పూర్తి చేస్తామని ఇందు కోసం అధికారులు రాత్రింభవళ్లు శ్రమిస్తున్నారని వారిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎ. శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె. సురేష్‌కుమార్, ఇతర ఇంజనీరింగ్ విభాగాపు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం సముదాయంలో సౌకర్యాల కొరత

## ఇబ్బందులు పడుతున్న గృహస్తులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం మర్లపాడు గ్రామంలో గత ఐదు సంవత్సరాలు క్రితం ప్రభుత్వం 40 మంది పేదలకు డబల్ బెడ్ రూమ్ నిర్మాణాలు చేసి పేదలకు పంపిణీ చేశారు. ఆ గృహాలలో రోడ్డు సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున, ఆవాసం ఉంటున్న గృహస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించకుండానే పంపిణీ చేసి గృహప్రవేశాలు కల్పించడంతో గృహాలలో ఉంటున్న లబ్ధిదారులు డ్రైనేజీ లేకపోవడం వల్ల దోమలు పెరగడంతో జ్వరాలు, జలుబు దగ్గుల పాలవుతున్నారు. రోడ్డు సౌకర్యం లేనందున మరియు సమీపంలోని పల్లె ప్రకృతి వనం తోపాటు చెత్త చెదారం పేరుకు పోయి ఉండటం వలన రాత్రి కాలంలో పాములు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో నివాసం ఉండాలంటే భయ భ్రాంతులకు గురవుతున్నామని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి కనీసం సౌకర్యాలు లేనందున ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తూ పేదలు ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని తెలుపుతున్నారు. డబల్ బెడ్ రూమ్ కాల



నీలో వీధిలైట్లు సక్రమంగా వెలగకపోవడం అంధకారంలో ఉంటున్నామని వివరిస్తున్నారు డబల్ బెడ్ రూమ్ సముదాయంలో విపరీతంగా గడ్డి పెరగడం దోమలకు అనుకూలంగా ఉండటం చెత్తా చెదారం గృహాల మధ్యనే ఉండటం డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా రోడ్డు మార్గం లేనందున అవస్థలు పడుతున్నామని మర్లపాడు డబల్ బెడ్ రూమ్ వాసులు మండల శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నారు. సమస్యలు పరిష్కరించనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## పాల్వంచ పట్టణ

# జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం(పాల్వంచ) :** పాల్వంచ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌళిక వసతులకల్పనకు కృషి చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కేసిఆర్ నగర్, అయ్యప్ప నగర్, రాజీవ్ గాంధీ మార్కెట్, కళాభవన్, రాహుల్ గాంధీ నగర్, వెంగళరావు కాలనీ ప్రాంతాల్లో రూ.4 కోట్ల డిఎంఎఫ్‌టి నిధులతో అభివృద్ధి పనులకు కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని, పనుల్లో నాణ్యతలోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని, ప్రజలు కూడా పనులపై దృష్టి సారించాలని చెప్పారు. అధికారులు, ప్రజలు,ప్రజాప్రతినిధులు సమిష్టి కృషి, నిర్ణయాలతో నియోజకవర్గంలోని సమస్యలన్నింటిని పరిష్కరించుకుని ఆదర్శవంతంగా నిలుద్దామని చెప్పారు. ఏ సమస్య వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారనికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ వివేక్, ఆర్అండ్‌బి ఇఇ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ స్వామి, ఆర్అండ్‌బి డిఇ నాగేశ్వరరావు, పట్టణ ఎస్సై రాము, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, కొండ వెంకన్న, పగిడిపల్లి మనోహర్, సిపిఐ నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, వీసంశెట్టి విశ్వేశ్వర రావు, ముత్యాల కిరణ్, వైఎస్ గిరి, రాకేష్, జకరయ్య, ఎస్‌కె పాషా, ఏస్ఏ రెహమాన్‌గౌస్ పాషా, అహ్మద్, దుర్గం రమేష్, విజయ్, భార్గవ్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని అరికట్టాలి

**(మొదటిపేజీ తరువాయి)**




ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు నిర్వహిస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నాయని విమర్శించారు. ఫీజుల మోత మోగిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టం అటకెక్కిందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వం కానీ, అధికారులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యను పూర్తిగా వ్యాపారం చేస్తున్నా అటు వైపు విద్యాశాఖాధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. అడ్మిషన్లతో పాటు డోనేషన్లు, బుక్స్, యూనిఫాం, ఇతరత్రా ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలన్న నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్టు పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో నర్సరీ, ఎల్‌కెజీ, యుకేజీలకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పాఠశాలల్లో, కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యాను అభ్యసించే వారికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల బకాయిలు ఏడువేల కోట్లకు పైగా ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడీని నియంత్రించి అనుమతి లేని పాఠశాలలు, కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీరా, సహాయ కార్యదర్శి శివానాయక్, కౌశిక్, గౌతమ్, జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, ప్రభాస్, రోహిత్ రాజ్, సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువ డాక్టర్ మృతి బాధాకరం

## దిలీప్‌కు సిపిఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనారోగ్యంతో యువ డాక్టర్ మృతి చెందడం బాధాకరమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన విశ్రాంత సింగరేణి ఉద్యోగి నాగారపు అంజయ్య కుమారుడు డాక్టర్ నాగారపు దిలీప్ హైదరాబాద్‌లో వైద్యునిగా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందాడు. మరణ వార్త తెలుసుకున్న సిపిఐ నాయకులు వారి స్వగృహంలో ఉంచిన దిలీప్ భౌతికాయాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ లు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగారపు అంజయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ ఏడాది క్రితం దిలీప్ ఆదర్శ వివాహం చేసుకున్నాడని అందరం ఎంతగానో సంతోషించామన్నారు. కానీ ఆకస్మాత్తుగా దిలీప్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. యువ వైద్యునిగా ప్రజాసేవ చేయాల్సిన దిలీప్ మరణం వారి కుటుంబానికే గాక యావత్ సమాజానికి కూడా నష్టమేనన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, రిటైర్డ్ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మిరియాల రంగయ్య, ఏఐటియుసి నాయకులు వెంకటేశ్వరరావు, నర్సయ్య, కోటేశ్వరరావు తదితరులున్నారు.

# వన మహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలి

## - సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్





**ప్రజాపక్షం/ తల్లాడ :** వన మహోత్సవ కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా చిన్న పెద్ద అనే తేడా లేకుండా చేపట్టాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం తల్లాడలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మొక్కలు ప్రాధాన్యత ఎంతో అవసరమని అంటూ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి వన మహోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటిన ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్ల పెంపకం ఎంతో ఉపయోగమని, చెట్లు పెంచడం ఒక బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ ఒక చెట్టును నాటి నాటిన చెట్టు బ్రతికించుకునే విధంగా చూడాలని ఆమె అన్నారు. చెట్టు పెంచడం వల్ల కాలుష్య నిర్మూలన చేయవచ్చునని, అదేవిధంగా చెట్లు పెంచడం వలన ఆయురారోగ్యాలు పెరుగుతాయని, వాతావరణ సమతుల్యానికి చెట్లు పెంపకం ఎంత ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ వన మహోత్సవ కార్యక్రమం ఒక పండుగలా చేపట్టాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ వినోద్, ఎంపిడిఓ చంద్రమౌళి, తహశీల్దార్ రవికుమార్, ఎంపిఓ శ్రీదేవి, ఎంఇఓ దామోదర్ ప్రసాద్, ఫారెస్టు అధికారి అరవింద్, ఎపిఓ కోటయ్య, ఎస్సై కొండలరావు, డాక్టర్ రత్నమనోహన్‌చ కాంగ్రెస్ నాయకులు రాయల రాము, గణేసుల రవి, గుర్రం శ్రీను, దగ్గుల రఘుపతిరెడ్డి, తుమ్మలపల్లి రమేష్, దగ్గుల నాగిరెడ్డి, పొన్నం కృష్ణయ్య, జనార్ధన్‌రెడ్డి, యరమల వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ, పుల నాగేశ్వరరావు, ముకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత ఎస్ఐ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

## - కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** దళిత ఎస్ఐ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఎంవీ,పాలెం గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చట్టాలు అమలు చేసే స్థానంలో ఉన్న పోలీసుశాఖలో కుల వివక్షత, వేధింపులు ఉండటం వల్లే దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని మరణించాడన్నారు. ఎస్ఐ స్థాయి వ్యక్తికే ఇటువంటి దారుణ పరిస్థితులు ఎదురయ్యి తనువు చాలించడంటే, సామాన్య,పేద దళితుల పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల స్థాయి కార్యదర్శి ఏపూరి వరకుమార్, నాయకులు కొమ్ము రాంబాబు, నంద్ర అశోక్, పంగా నాగేశ్వరరావు, గుర్రం ఉసేన్, పంగా మహేష్, వడ్లమూడి పవన్‌కుమార్, పాపిట్ల సతీష్, పాపిట్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సదరం క్యాంప్‌కు 126 మంది హాజరు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దివ్యాంగ అర్హత ధృవీకరణ పత్రాల కోసం నిర్వహించిన సదరం క్యాంపుకు 126 మంది హాజరైనట్లు ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరానికి 126 మంది హాజరు కాగా వారిలో 80 మందికి దివ్యాంగ వైకల్య అర్హత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మొత్తం 165 మంది స్లాట్ బుక్ చేసుకోగా శిబిరానికి 126 మంది హాజరయ్యారని వారిలో 80 మందికి అంగవైకల్యం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. 39 మంది అనర్హులుగా గుర్తించామన్నారు. 33 మంది గైర్హాజరయ్యారన్నారు. ఎముకలు, కీళ్ల విభాగంలో 63 మంది, కంటి పరీక్షల్లో 16 మంది, మానసిక స్థితికి సంబంధించి 31 మంది, చెవికి సంబంధిత సమస్యతో బాధపడేవారు తొమ్మిది మంది వైకల్య పరీక్షలు జరిపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో రాంబాబు, ఆర్థోపెడిక్ వైద్యులు వినయ్‌కుమార్, ఫిజియోథెరపి వైద్యురాలు జ్యోతి, ఈఎన్‌టి వైద్యులు సౌజన్య, ఆడియాలజిస్టు ఆదర్శ్, కంటి వైద్య నిపుణులు రాము నాయక్, అప్తాలనిక్ అసిస్టెంట్ రాజేష్, వైద్యులు రాంప్రసాద్, బాబూరత్నాకర్, స్పెషల్ ఎడ్యుకేటర్ ప్రసన్న, వినయ్, వీరన్న పాల్గొన్నారు.

# రైతాంగానికి తక్షణమే రైతు భరోసా అందించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** రైతాంగానికి తక్షణమే రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలని బిజెపి మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు డిమాండ్ చేశారు. బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రైతాంగ సమస్యలపై మండల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలుగా కావస్తున్న రైతులకు ఇంత వరకు రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని, కేంద్రం ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను, రైతు బీమాను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్‌మోర్చా అధ్యక్షులు చౌడ నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి గాద కృష్ణారావు, కార్యదర్శి రాయల రమేష్, గొల్లమండల నరేష్, సంగీతం సాయి, చందు, చల్లా నరేష్, తమ్మిశెట్టి కృష్ణ, ఎల్లంకి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా శీతల పండుగ వేడుకలు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలోని మండల అధ్యక్షులు రవినాయక్ ఆధ్వర్యంలో మల్చూర్ తండా గ్రామంలో శీతల పండుగను లంబాడీల సాంప్రదాయ ప్రకారం అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ ఈ శీతల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బంజారా సోదరులు ఒకే రోజు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శీతల పండుగ సందర్భంగా వర్షాలు బాగా కూరవాలని, పంటలు బాగా పండాలని, రాష్ట్రంలో ఉన్న ప్రజలు సస్యశ్యామలంగా, సుఖసంతోషాలతో జీవించాలని తండాలో ఉన్న నాయక్ కార్బారి ఆసాతిభవానిలను వారు పూజించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్ లింగా నాయక్, మానిసంగ్ నాయక్, బిక్కు నాయక్, జోగా నాయక్, చమ్మన్ నాయక్, వాలియా, సక్రియ, బద్రిభాయి, పద్మాబాయి, దివిలిభాయి, తిరుపాబాయి తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైరాలో వనమహోత్సవం

## -పాల్గొననున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**ప్రజాపక్షం/వైరా:** నేడు వైరా మున్సిపాలిటీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమీషనర్ సిహెచ్.వేణు తెలిపారు. ఈ వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొని మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ నేతలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమీషనర్ అన్నారు.

# ఐదో వార్డులో డ్రైడే



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదు వార్డులో వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు బారిన పడకుండా వర్షాకాలంలో మన పరిసర ప్రాంతాలని శుభ్రంగా ఉంచుకొని మన ఇళ్ళల్లో ఉన్న పాత డబ్బాలు కూలర్లలోని మురికి నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలని, డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పి నాగమణి, ఆశా వర్కర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో ఖరీఫ్ నాట్లు ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల ,చంద్రుపట్ల , ఎర్ర బోయినపల్లి, బత్తులపల్లి, పేరువంచ తదితర గ్రామాలలో నీటి సౌకర్యం కలిగిన నేల బావులు, విద్యుత్ వ్యవసాయ బోరులు పరిధిలో కరివేద పద్ధతిలో 8000 ఎకరాలు, దమ్ములు చేసి నాట్లు 13000 ఎకరాలలో నాట్లు వేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు కు నీటి సౌకర్యం కలిగిన ప్రాంతాలలో నాట్లను వేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి రూప తెలిపారు. ఖరీఫ్ సీజన్ లో ఋతుపవనాలు ప్రవేశించడం వలన వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఏవో తెలిపారు.

## హోంగార్డ్ ఆఫీసర్స్‌కు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని హోంగార్డ్ ఆఫీసర్స్‌కు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హోం గార్డులకు, హోంగార్డ్ కుమార్తెల వివాహం కోసం మంజూరైన ఆర్థిక సాయాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందజేశారు. హోంగార్డ్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, ఉపేందర్, నవీన్, కోటేశ్వరరావు, కిషన్ తదితరులు సిపి చేతుల మీదుగా చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి సుశీల్ సింగ్, ఆర్ఐ సురేష్, హోంగార్డ్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది..

**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని బోదులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బిందు అన్నారు. మండలం లోని కోనాయిగూడెం లో మంగళవారం వైద్య శిబిరం ను నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. దోమ పుట్టకుండా...అది కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీ.హెచ్.ఎన్.కర్నాటి వాణి, ఏఎన్‌యం లు పద్మావతి, అబేదా, ఆశా కార్యకర్త చెరుకుపల్లి బేబి, పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ చేతుల మీదుగా చిలుకూరు గ్రామానికి చెందిన రావిరాల లక్ష్మీ కి మంజూరైన చెక్కును అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది అనంతరం ఆర్థిక సహాయం కోసం సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు డిప్యూటీ సిఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందచేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, కిసాన్ సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీకృష్ణ, బొమ్మకంటి హరిబాబు, సంపసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**ప్రజాపక్షం/ మధిర :** విద్యుత్ షాక్‌తో మధిర మండలం మల్లారం గ్రామ రైతు మచ్చ వెంకటేశ్వరరావుకు చెందిన గేదె మృతి చెందింది. రోజులాగానే పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాకుకు గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రూ.1లక్షల విలువ చేసే పాడి గేదె మృతి చెందిందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

## లారీ ఢీకొని మాజీ ఉపసర్పంచ్ మృతి



**ప్రజాపక్షం/బోనకల్:** జగ్గయ్యపేటవైరా ప్రధాన రహదారిపై రావినూతల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో కాంక్రీట్ మిక్సర్ లారీ ఢీ కొట్టడంతో అదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బోయినపల్లి కొండలు(53) అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున కొండలు తన వ్యవసాయ పొలానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కాంక్రీట్ మిక్సర్ లారీ ఢీ కొట్టింది. కాంక్రీట్ మిక్సర్ లారీ ద్విచక్రవాహనం, కొండలు పై నుంచి వెళ్లి విద్యుత్ స్థంభానికి వేగంగా తాకడంతో విద్యుత్ స్థంబం ధ్వంసమైంది. కొండలు కు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలుండగా ఒక కుమార్తె నాలుగేళ్లక్రితం అనారోగ్యంతో మృతిచెందింది. సంఘటన స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహన్ని జడ్పీ లింగాల కమల్‌రాజు, మాజీ జడ్పిటిసి బానోత్ కొండ, రావినూతల మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్‌లు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రతిఘటన ఉద్యమాలతో సింగరేణిని పరిరక్షించుకుంటాం

**- బొగ్గుబావుల వేలం ప్రక్రియ విరమించుకోవాలి**
**- దీక్షల శిభిరాన్ని సందర్శించి**
**సంఘీభావం తెలిపిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాజపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతిఘటన ఉద్యమాల ద్వారా సంగరేణిని పరిరక్షించుకుని తీరుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణిగుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. బొగ్గుబ్లాకులను వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణిప్రధాన కార్యాలయం వద్ద గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షల శిభిరాన్ని ఆయన మంగళవారం సందర్శించి సిపిఐ రాష్ట్ర సమితి పక్షాన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలో ఉన్న మంద బలంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు, చట్టాలను తీసుకువస్తూ ప్రభుత్వం రంగ సంస్థను కారు చౌకగా ప్రైవేటుకు దారాదత్తం చేస్తోందని, తెలంగాణలో సింగరేణిని దశలవారీగా నిర్వీర్యం చేసేందుకు కుట్రల చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, సంగరేణిని అదాని, అంబానీ లాంటి కుబేరులకు కట్టబెట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగసంస్థలను తాకట్టుపెట్టిన కేంద్రం మరో అడుగు ముందుకేసి తెలంగాణకు మనిహారంగా ఉన్న సింగరేణిని లేకుండా చేసే చర్యలకు పూనుకుందన్నారు. ఇక్కడ బొగ్గు బావులను ప్రైవేటీకరిస్తే కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రశ్నార్థకంగా మారుతాయని, ఇందుకోసం అంతా కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వేలం ప్రక్రియను కేంద్రం విరమించుకుని తెలంగాణ బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, జి వీరస్వామి, వంగ వెంకట్, క్రిష్టాఫర్, కత్తెర్ల రాములు, సందెబోయిన శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, సురేందర్, చంద్రయ్య, ఆరె రాజు, అంకం రాజయ్య, కె కుమార్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షులుగా చంద్ర నరేంద్ర,**
**కార్యదర్శిగా విశ్వనాదం ఏకగ్రీవం**
**- 21 మందితో కార్యవర్గ, 38 మందితో కౌన్సిల్**
**- రైతాంగ సమస్యలపై దశలవారీ పోరాటాలు**
**- ఏఐకేఎస్ జిల్లా కౌన్సిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో జరిగిన సంఘం ద్వితీయ సభలో ఎన్నికైన 59 మందితో ఏర్పాటైన నూతన కౌన్సిల్ సభ్యులు మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఆమోదించారు. గౌరవ అధ్యక్షులుగా ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, అధ్యక్షులుగా చంద్ర నరేంద్ర, కార్యదర్శిగా ముత్యాల విశ్వనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి పాపారావు, మంగి వీరయ్య, ఆంద్రు వామనరావు, పరమ ఇమ్మానియేలు, వాడే లక్ష్మీ, సాల్వ రవికుమార్, సపావట్ రవి, సహాయ కార్యదర్శులుగా చంద్రగిరి శ్రీనివాసరావు, కొమారి హనుమంతరావు, గుగులోత్ రామచందర్, బొల్లోజు వేణు, పాండవుల బిక్షం, నరాటి రమేష్, యాసా రోశయ్య, కోశాధికారిగా పద్దం విజయలక్ష్మీ లతో పాటు మరో 59 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నరేంద్ర, ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేసి ప్రభుత్వాలను నిలదీసే సంఘం ఏఐకేఎస్, తెలంగాణ రైతు సంఘం మాత్రమే అన్నారు. పంటలకు గిట్టుబాట ధర, రైతుభరోసా పధకం, డా.స్వామినాధన్ కమీషన్ సిఫార్సులు అమలు, పోడుభూములకు పట్టాలు, సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు, రుణాలు, రుణమాఫీ కోసం దశలవారీ ఉధ్యమాలు నిర్వహిస్తామని తద్వారా జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చి జిల్లాలోని రైతులకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.

## వైరా మున్సిపాలిటీ ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్కడ?

**-ప్రజలకు అందుబాటులో ఉండని**
**ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు**
**-వైరా మున్సిపాలిటీలో పాలన ఇబ్బందులు**
**-కీలక అధికారులు అందుబాటులో లేకపోతే ఎలా?**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో విధి నిర్వహణలో సక్రమంగా పనిచేయని ఏఈ టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు పట్ల ప్రజలు ఆగ్రహం తెలుపుతున్నారు. కీలకమైన ఉద్యోగులు విధి నిర్వహణ అలసత్వంతో సమస్యల వలయంగా వైరా మున్సిపాలిటీ మారింది. వైరా మున్సిపాలిటీకి నూతన ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులను కేటాయించాలంటున్న ప్రజలు, వైరా మున్సిపాలిటీని టౌన్ ప్లానింగ్ అధికారి, ఏఈ సమస్య వేధిస్తుంది. విధి నిర్వహణలో సక్రమంగా లేకపోవడంతో మున్సిపాలిటీలో సమస్యలు, అటు ఆదాయానికి భారీగా గండి పడుతుంది. వైరా మున్సిపాలిటీలో విధులు నిర్వహణలో పాల్గొనక పోవడం మున్సిపాలిటీకి ఇబ్బందికరంగా మారింది. వయసు రీత్యా ఏఈకి ఆరోగ్య సమస్యలు ఇబ్బందికరంగా ఉండడంతో అటు విధి నిర్వహణకు ఇటు సమస్యల పరిష్కారానికి న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో సక్రమంగా విధులకు రాకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. వైరా మున్సిపాలిటీలో ఏఈ పాత్ర కీలకం. పలు ప్రాంతాల్లో ఏఈ పర్యవేక్షణ లేకపోవడంతో తీవ్ర సమస్యలు వెంటాడుతున్నాయి. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ అధికారి పూర్తిస్థాయిలో ఇక్కడ విధి నిర్వహణ లేకపోవడం ఆయనకు ఖమ్మం కార్పొరేషన్, మహబూబాబాద్ మున్సిపాలిటీలను అదనం కేటాయించడం కూడా వైరా మున్సిపాలిటీకి శాపంగా మారింది. ఎంతో ఆదాయాన్ని సమకూర్చాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారి పూర్తిస్థాయిలో విధి నిర్వహణ లేకపోతే ఆ మున్సిపాలిటీ ఆదాయం భారీగా గండి పడుతుందని చెప్పవచ్చును. ఎందుకంటే మున్సిపాలిటీలో జరుగుతున్న నిర్మాణాలు కావచ్చు. రియల్ వెంచర్లు ఏర్పాటు కావచ్చును. ఇలా మున్సిపాలిటీలో కీలకమైన ఏఈ టౌన్ ప్లానింగ్ అధికారి విభాగాల్లో విధి నిర్వహణ సక్రమంగా లేకపోవడంలో ప్రజల నుంచి వస్తున్న వత్తిలకు మున్సిపాల్ కమీషనర్ కూడా సతమతమవుతున్న పరిస్థితి. ఎందుకంటే కీలకమైన టౌన్ ప్లానింగ్ ఏఈ పదవులు మున్సిపాలిటీకి రెండు కళ్ళు లాంటివి. అలాంటి పదవులు అలాంటి ఉద్యోగ విధి నిర్వహణలో వారు సక్రమంగా విధులు నిర్వహించలేకపోవడం సమస్యలు పేరుకుపోవడంతో మున్సిపాల్ కమీషనర్‌పై భారీగా ఒత్తిడి పడుతుంది. దీంతో ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ప్రజల నుంచి ఎదురవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే విధంగా ఉండే ఏఈని టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్థిక చేయూతకు మహిళా శక్తి..!

**-వివిధ రకాల యూనిట్ల స్థాపనకు ప్రణాళికలు**
**-సంతోషం వ్యక్తం చేస్తున్న స్వయం సంఘాల సభ్యులు**



**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** స్వయం సహాయక సంఘాల సభ్యుల మహిళలను ఆర్థిక చేయూత ను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమం ను ప్రారంభించింది. ఇందులో భాగంగా అమలు చేయాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన కార్యచరణ ను ప్రణాళికలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తయారు చేస్తున్నారు. బ్యాంకు రుణాలతో పాటు స్వయం ఉపాధి తో ఆర్థికంగా ఎదిగేందుకు అనేక రకాల యూనిట్ల ను స్థాపించేందుకు కార్యచరణ ను రూపొందించారు. మొదటి విడతగా పలు మండలాలలో గ్రామానికి ఒకటి ఎంపిక చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో వారికి బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు అందజేస్తున్నారు. వీటితో పాటు 13 రకాల యూనిట్ల ను నెలకొల్పటం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలోని 20 మండలాలలో ఉన్న వేలాది స్వయం సహాయక సంఘాలలో సభ్యులను ఆర్థికంగా పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం అనేక రకాల యూనిట్ల ను ఏర్పాటు చేసి వీరి చేతికి అప్పగించాలని యోచిస్తుంది.

**ఏర్పాటు చేసే విధానం...**

వివిధ రకాల యూనిట్ల కు బ్యాంక్ రుణంతో పాటు స్త్రీ నిధి మహిళా సంఘాల, వీవో ఫండ్ తో రుణాలను అందించనున్నారు. యూనిట్ల ఏర్పాట్లు చేసిన తరువాత ప్రతీ నెలా రుణాల ను వారు సూచించిన విధంగా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కిరాణం, టెంట్‌హౌస్, లేడీస్ ఎంపోరియం, వృద్ధాల యూనిట్ల తదితర యూనిట్ల ను స్థాపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎంఎస్.క్యాంటీన్లు ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న ప్రాంతాలో ప్రభుత్వ భవనాలలో ఎలాంటి అద్దె చెల్లించకుండా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో పలు మండలాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. మండలానికి ఒక పౌల్ట్రీ యూనిట్ల మంజూరు చేస్తారు. కోడి పిల్లలను అందించి షేడ్డు ఏర్పాటు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాడి గేదెల పంపంకం, వ్యవసాయ పరికరాలు అద్దెకు ఇచ్చే విధంగా కార్యచరణ ను రూపొందిస్తున్నారు. ఇలా అనేక యూనిట్లను స్థాపించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కార్యచరణ ను చేపట్టారు.

**మహిళల పట్ల ప్రభుత్వం కు చిత్తశుద్ధి :**
**పెంటమళ్ల పుల్లమ్మ, సంఘం సభ్యురాలు, అనంతనగర్.**



మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. మహిళల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంది. అందుకే అనేక రకాల యూనిట్ల స్థాపన చేసి మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించేలా చర్యలు తీసుకుంటుంది. మహిళల మద్ధతు ఎప్పటికీ ప్రభుత్వం కు ఉంటుంది.

**మహిళల బలోపేతమే ప్రభుత్వం లక్ష్యం :**
**మరికంటి శైలజా, గ్రామదీపిక, బైరవునిపల్లి.**



తెలంగాణ ప్రభుత్వం మహిళల ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటుంది. స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు స్వయం సహాయ సంఘాల కృషి చేస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే యూనిట్ల ద్వారా ఆర్థికంగా నిలబడేలా ముందుకు సాగాలి.

**సద్వినియోగం చేసుకోవాలి :**
**యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.**



ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మహిళ సంఘాల సభ్యుల లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. సభ్యులు కూడ ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

# తొలకరి వరి నాట్ల సందడి..!

**-ఊపందుకున్న సాగు పనులు**
**-వర్షంతో చెరువులు, కుంటలకు జలకళ**
**-గ్రామాల్లో వలస కూలీల సందడి**
**-వర్షాలు రావడంతో రైతన్నల ఆనందం**





**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతన్నలు తొలకరి వరి నాట్ల సందడితో పల్లెల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ సారి వర్షాలు కొద్దిగా ఆలస్యమైనా మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తుండడంతో బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు చేరింది. సీజన్ ప్రారంభంలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో బోరు బావుల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. నీరు సరిపోకపోవడంతో నాట్లు ఎలా వేయాలా అని రైతన్నలు సతమతమవుతున్న సమయంలో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భ జలాలు పైపైకి చేరుకున్నాయి. దీంతో సాగునీటికి ఇబ్బంది ఉండదనే భరోసాతో వరి సాగుపై రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు.ఈ ఏడాది మృగశిర కార్తె ముగియగానే వర్షాలు కురుస్తుండడం రైతులకు శుభ సంకేతాలను పంపినట్టయింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. వరి నారు మళ్ళు జూన్ మొదటి వారంలోనే పోశారు. ఇప్పుడు వరి నారు మళ్లు చేతికి రావడంతో రైతన్నలు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. పినపాక మండలం పరిధిలోని రెడ్డిపాలెం, చింతల బయ్యారం, జానంపేట, భూపతిరావుపేట, టి కొత్తగూడెం, దుగినేపల్లి, రావిగూడెం పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ బోర్ల వద్ద వరి నారు మళ్లు చేతికి రావడంతో రైతులు వరినాట్లు వేస్తున్నారు. గత మూడు రోజులుగా రాత్రివేళ కురుస్తున్న భారీ వర్షాలతో పంట పొలాల్లోకి నీళ్లు చేరాయి. వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ట్రాక్టర్లతో దమ్ములు చేసి వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. వర్షపు నీటితోపాటు వ్యవసాయ బోర్ల వద్ద నీరు రైతులకు కలిసి వస్తోంది. అటు వర్షపు నీరు.. ఇటు బోర్ల నీటితో రైతులు వరి నారు మళ్లను వేగవంతం చేశారు. వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతుండడంతో మళ్లీ పల్లెల్లో భూములన్నీ పచ్చబడుతున్నాయి. కొన్ని చోట్ల వర్షపు నీరు పంట పొలాల్లో నిలిచి ఉండడం, చిన్న చిన్న వాగులు, వంకలు మూడు రోజులుగాకురుస్తున్న వర్షాలతో వర్షపు నీటితో కళకళలాడుతూ సాగుకు సరిపడా నీరు ఉండడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో వానాకాలం ప్రారంభంలో వ్యవసాయ కూలీలు వరి నాట్ల విషయాల్లో మహిళలు చాలా జోష్ గా పనిచేస్తారు. భూమి యజమాని దగ్గర నుంచి ఎకరాకు కట్టుబడిగా మాట్లాడుకుని మూట సభ్యులుగా ఏర్పడి వరి నాట్లు వేయడం సాగిస్తుంటారు. ఈ సీజన్లో వరి నాట్లు మహిళలకు ప్రత్యేక శ్రద్ధతో నాట్లు వేస్తారని వ్యవసాయదారుల నమ్మకం. అలాగే మండల పరిధిలో వలస కూలీలు మగ వారు కూడా బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వరి నాట్లు వేయడానికి మగ పురుష కూలీలతో గ్రామాల్లో ఉన్న మహిళల కూలీలకు కూడా పోటీపడి వరి నాట్లు వేస్తూ సందడి చేయడం గమనార్హం. దీంతో సాగు చేస్తున్న వ్యవసాయ రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల ఆత్మహత్య యత్నాలు కలిచివేస్తున్నాయి : రేగా



**ప్రజాపక్షం/మణుగూరు:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరుస రైతు ఆత్మహత్య యత్నాలు కలిచివేస్తున్నాయని ప్రభుత్వ మాజీ విప్, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. పురుగుల మందు తాగి ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరులో ఒక రైతు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జానకీపురంలో ఒక రైతు ప్రాణాలు విడిచారన్నారు. ముదిగొండ, రఘునాధపాలెం మండలాల రైతులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. రైతులెవరూ ధైర్యం కోల్పోవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ, కెసిఆర్ మీకు అండగా ఉంటారని భరోసా కల్పించారు. అన్ని ఘటనల వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రమేయం, ఒత్తిడి కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తప్పక తగులుందన్నారు. రైతులకు అండగా ఉండి సమస్యలు తీర్చాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని రేగా తెలిపారు.

## గుండెపోటుతో స్టాఫ్‌నర్స్ మృతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ఐన కళ్యాణి(40) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గత కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణికి ఇంటి వద్ద ఒక్క సారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. అందరితో కలివిడిగా ఉంటే కళ్యాణి మృతి చెందటంతో ఆస్పత్రి వర్గాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబానికి సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు.

## సిజి ఊసూరు పోలీస్ స్టేషన్ వద్ద మహిళల ఆందోళన



**ప్రజాపక్షం/చర్ల :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ వద్ద గిరిజనులు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నడపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఈ సందర్భంగా స్టేషన్ వద్ద పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊసూరు పిఎస్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నడపల్లి గ్రామానికి చెందిన 80 మంది గ్రామస్తులను ఊసూరు పోలీసులు సోమవారం అదుపులోనికి తీసుకున్నారు. వారిలో కొందరిని విడుదల చేయగా మిగతా వారు పోలీసుల అదుపులోనే ఉన్నారు. తమ దుపులో పెట్టుకున్న తమ వారిని పోలీసులు భేషరతుగా విడుదల చేయాలని మహిళలు ఆందోళన చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఆదివాసీలు ఆందోళనకు దిగారు. ఆదివాసీల అక్రమ నిర్భందం పై పిసిసి కమిటీ నియమించింది. ఆ కమిటి నడిపల్లి గ్రామానికి రానుంది. ఈ నేపథ్యంలో ఊసూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహిళలు నిరసన చేస్తున్న వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బురదరాఘవాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై బాదావత్ రవి తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పినపాక రమణయ్య(65) అనే రైతు తన పొలంలో కలుపు తీసుకుంటూ వెళ్లి స్థంభానికి ఎటాచ్‌గా ఉన్న స్టేవైర్ పట్టుకోగా ప్రమాదవశాత్తు కుడి చేతికి తగిలి విద్యుత్‌షాక్‌తో మరణించాడు. తన కొడుకు ఉపేందర్‌రావు ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీ భక్తాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పట్టణం సమీపంలో ఉన్న వెంకమ్మ చెరువు కట్టపై కొలువైన శ్రీ భక్తాంజనేయస్వామి వారికి ఆయకట్టు రైతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పాడి పంటలతో రైతుల కుటుంబాలు కళకళలాడాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ స్వామి వారికి 108 బిందెల నీటితో అభిషేకించారు. అనంతరం పాలతో స్వామి వారిని అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నసమారాధణ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌ల పరిశీలన



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని పూసుగూడెం గ్రామంలో గల సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణలు పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక ఇరిగేషన్ ఆఫీసులో జిల్లా ఇరిగేషన్, వివిధ రకాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేసిన విదేశీ టెక్నాలజీతో నిర్మించిన పంప్ హౌస్‌ల మోటార్ల చెకింగ్ కోసం చైనా నుంచి నిపుణులు కావాలసి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వారిని త్వరలోనే రప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారు వచ్చిన తర్వాత పనులు ప్రారంభించి ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు అతి త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంచడం జరుగుతుందన్నారు. తద్వారా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నీటి అందించి రైతుల కళ్ళలో ఆనందం చూడాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి నాంది పలకాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మోసగాళ్లు అరెస్ట్

-రూ. కోటి 47 లక్షలు స్వాధీనం
-విలేకరుల సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసి డబ్బులు వసూళ్లు చేసిన ముఠాను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.1 కోటి 47 లక్షల 14 వేలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సింగరేణితో జూనియర్ అసిస్టెంట్లు, డిపెండెంట్ జాబ్‌లు, గ్రూపు 2, ఏసిటిఓ, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ చేయిస్తామని మాయమాటలు చెప్పి రూ.4 కోట్ల 8 లక్షలు వసూళ్లు చేసిన ముఠాపై జిల్లాలోని పలు స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు 13 మందిని గుర్తించి 10మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తాజాగా దాసు హారికను అరెస్టు చేసి నగదుతో పాటు నాలుగు తులాల బంగారం, రాయల్ ఇన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. అదే కాకా బ్యాంకులో 92.8 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టిన రుణం తీసుకున్నట్లు నింధితులు తెలిపారు. వాటిని కూడా వీలైనంత త్వరగా చట్ట ప్రకారం స్వాదీనం చేసుకోవడం జరుగుతుందని సిఐ తెలిపారు. ఇప్పటికే దాసు హారికతో పాటు దాసు హరికిషన్, గుండా వినోద్, ఉపేంద్ర నాయుడు తదితరులు అరెస్ట్ అయ్యారని, పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు రూహాత్ భేగ్, ఉపేందర్ నాయుడు, రవిరాజ్‌లను కూడా త్వరలో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కేసులో వీలైనంత త్వరగా బాధితులను న్యాయం జరుగుతుందన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన డిఎస్‌పి రెహమాన్, చంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రవీణ్ తోపాటు సిబ్బంది ఉన్నారు.

# మొక్కల సంరక్షణ భావిభారత పౌరులదే..

-వన మహోత్సవంలో ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని మండల అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఆయనకు పాఠశాల సిబ్బంది విద్యార్థులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ జారే మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే బాధ్యత భావి భారత పౌరులైన నేటి విద్యార్థులే తీసుకోవాలని, వారిపైనే ఎక్కువ బాధ్యత ఉంటుందన్నారు. చదువుతో పాటు వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని మొక్కలకు మనకు ఎంతో అన్యోన్య సంబంధం ఉంటుందని, త్వరలోనే పాఠశాలల్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని, ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికి తీసే విధంగా ఉంటాయని, ఈ కార్యక్రమాలను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జెడ్‌పిటిసి భారత లావణ్య, ఎంపిపి సున్నం లలిత, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపిడివో మహాలక్ష్మి, ఎంఈవో సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్, మండల నాయకులు వనమా గాంధీ, పరసా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎప్పటిలా కాకుండా కొంత ప్రత్యేకతను సంతరించుకుంది. ఈకార్యక్రమానికి శాసన సభ్యులు జారే ఆదినారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎన్నో కార్యక్రమాలను అభివృద్ధి చేయటంలో ప్రజాప్రతినిధులు ఎంతో కీలకపాత్రను పోషించారని వారి సహాయ సహకారాలు అందించారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఇంతకు ముందే సర్పంచుల పదవీకాలం అయిపోయింది వారి స్థానంలో స్పెషల్ ఆఫీసర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే మండల స్థాయి ప్రజాప్రతినిధుల పదవీకాలం కూడా ముగిసే సమయం వస్తుందని, ప్రజాప్రతినిధులకు ప్రజలు అందించే ఈ ఐదు సంవత్సరాల పదవీకాలం ఎంతో గొప్ప బహుమతిని, దీని వినియోగించుకొని ప్రజలకు సేవ చేసిన వారికి ప్రజలే మరలా పట్టం కట్టి ప్రజాప్రతినిధులగా ఎన్నుకుంటారని, ప్రజలకు సేవ చేయని వారిని ప్రజల నిర్ణయంతో పక్కన పెడతారని అది ఏ స్థాయి ప్రజాప్రతినిధికైనా ప్రజల తీర్పుతో జరుగుతుందని కనుక ప్రజాప్రతినిధులు ఎప్పుడూ కూడా ప్రజలకు సేవ చేస్తూ ప్రజల కావాలసిన అవసరాలను తీరుస్తూ వారికి వెన్నంటే ఉండాలని, అప్పుడే ప్రజలు ఇచ్చిన తీర్పుకు మనం న్యాయం చేసిన వారమవుతామని తెలిపారు. అనంతరం జెడ్‌పిటిసి భారత లావణ్యకు, ఎంపిపి సున్నం లలితకు, వైస్ ఎంపిపి మామిళ్ళపల్లి రామారావుకు, మండలంలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ సమక్షంలో మెమొంటోలు దృశ్యాలువాలతో సత్కరించి వీడ్కోలు తెలిపారు. అనంతరం అందరి సమక్షంలో ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి, ఎంఈవో సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి అనూష, ఎంపివో షబానా, సిడిపివో నిర్మల జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు గంగాజలం , అరుణ, ఐకెపి సీసీలు, వివిధ రకాల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య పనులు

**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలోని బోనకల్ గ్రామ పంచాయతీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దామెర్ల కిరణ్ తెలిపారు. వీధుల్లోని, మురికి కాలువల్లోని చెత్తను తొలగించి క్లోరినేషన్ చేశామన్నారు. దోమల ఉధృతి పెరగకుండా మురిగి నీటిలో అయిల్ బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలల్లో నిలిచి ఉన్న నీటిని తోలగించి బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని కలిసిన సింగరేణి మండల నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సింగరేణి మండల నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి కలిసి వైరా క్యాంపు ఆఫీసులో సింగరేణి మండలంలో భాగ్యనగర్ నుండి పోలంపల్లి సోలార్ ప్లాంట్ వరకు గత 15 సంవత్సరాల నుండి మట్టి రోడ్డు గుంటలు గుంటలుగా ఏర్పడి రవాణాకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఇట్టి సమస్యలపై త్వరలోనే పరిష్కారమయ్యే విధంగా చూస్తానని ఆయన అన్నారు. రోడ్డు సమస్యపై ఇతర సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డివిజన్ నాయకుడు గుగులోతు తేజనాయక్, తాటి పాపారావు, ధరావత్ సక్రునాయక్, గుగులోతు రాము, పాయం వెంకటేశ్వర్లు,హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంస్కృతి సీత్లా పండుగ



**ప్రజాపక్షం/కారేపల్లి:** గిరిజన సంసృత్కి సీత్లా పండుగ సింగరేణి మండంలో ఘనంగా నిర్వహించారు. వర్షాకాలం సీజన్‌లో తొలకరి జల్లులు పడుతున్నప్పుడు తండాల్లో లంబాడా గిరిజనులు జరుపుకునే మొదటి పండుగ సీత్లా పండుగకాగా ఖమ్మం, జిల్లావ్యాప్తంగా ఉన్న తండాల్లో మంగళవారం సీత్లా పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. వర్షాలు సంవృద్ధిగా పడి,పాడి పంటలు సంవృద్ధిగా ఉండాలని లంబాడా గిరిజనులు ప్రతిఏటా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు.

# ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శిగా పాండవుల భిక్షం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అఖిల భారత కిసాన్ సభ రెండవ జిల్లా మహాసభల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బూర్గంపాడు మండల పరిధిలోని గ్రామానికి చెందిన పాండవుల భిక్షం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పస్య పద్మ, భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా భిక్షం మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన పదవిని భాద్యతతో వ్యవహరిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు చేపడితే సమస్యల మీద రాజీలేని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

# వారపు సంత వేలం పాట కైవసం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు వారపు సంత వేలం పాట మంగళవారం నిర్వహించారు. బూర్గంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఈవో కొమరం సమ్మయ్య అధ్యక్షతన ఎంపివో సునీల్ శర్మ ఆధ్వర్యంలో సంత పాటను రూ లక్షల 94వేలకు మండల కేంద్రంలోని గౌతమిపురం కాలనీకి చెందిన ఎస్‌కె మీరావలి కైవసం చేసుకున్నారు. ఈసంవత్సరం కనీస మద్దతు ధర రూ 1లక్షల 24 వేలుగా నిర్ణయించగా, సంత వేలం పాటను రూ లక్ష 24వేల నుండి ప్రారంభించారు. అంతకు ముందు గ్రామ పంచాయితీ ఆవరణలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను వేలం పాటను నిర్వహించగా డిపాజిట్ దారులు షాపింగ్ కాంప్లెక్స్‌లను పాట పాడకపోవడంతో వేలం పాట వాయిదా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరల షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పీర్ల సావడి దర్గా ప్రారంభం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణంలోని పాత తహాశీల్దార్ కార్యాలయంలో సమీపంలో నూతనంగా నిర్మించిన ముస్లిం సోదరుల పీర్ల సావడి దర్గాను పెద్దలు రాయల తిరుమలయ్య చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో నడుమ ఉత్సాహంగా దర్గా వేడుకలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, రాయల రాము, గుంటుపల్లి వెంకటయ్య, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, నంబూరు మోహన్‌రావు, నంబూరు నారాయణ, పీర్ల ముజవార్ షేక్. ఈసూబ్, ముస్లిం మత పెద్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి



- ప్రభుత్వవిద్యా సంస్థల అభివృద్ధికి రూ.3.99 కోట్ల ప్రతిపాదనలు
- నూతన పాలిటెక్నిక్, నవోదయ, జూ.కళాశాల ఏర్పాటు
- ఐటి హబ్ ఇండస్ట్రియల్ కారిడార్‌కి సుముఖత
- పాల్వంచ ప్రభుత్వాస్పత్రిని 100 పండకలుగా మార్చేందుకు హామీ
- ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి, ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి రూ.3.99 కోట్ల నిధులకు సంబంధించి నివేదికలను ప్రిన్సిపల్ సెక్రెటరి వెంకటేశంకు అందించినట్లు ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం ప్రభుత్వ జూ.కళాశాలకు రూ.2.25 కోట్లు, పాల్వంచ ప్రభుత్వ జూ.కళాశాలకు రూ.84 లక్షలు, లక్ష్మీ దేవిపల్లి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలకు రూ.90 లక్షల ప్రతిపాదనలు అందించినట్లు చెప్పారు. ఈ నిధులతో అదనపు గదులు, నూతన భవనాల నిర్మాణం, మౌళిక వసతుల కల్పనకు వెచ్చించనున్నట్లు తెలిపారు. త్వరలో నిధుల మంజూరికి ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీ ఇచ్చారని కూనంనేని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలో నవోదయ విద్యాలయం, సుజాతనగర్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఐటి మంత్రి శ్రీధర్ బాబుతో భేటి అయినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఐటి హబ్, ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరామని, దీనపై త్వరలో ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాగా వీటి ఏర్పాటుకు సుమారు 60 ఎకరాల స్థలం అవసరం ఉన్నందున స్థలానికి సంబంధించిన వివరాలు అందించాలని మంత్రి కోరారని చెప్పారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుండి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి లేఖ అందించి అందుకు సంబంధించిన వివరాలు స్వయంగా వివరించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించిన ప్రక్రియలు త్వరలో పూర్తవుతాయని చెప్పారు. తన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్, హెల్త్ సెక్రెటరీలకు అభినందనలు తెలిపారు.

# సీతారామ ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచండి

-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** సీతారామ ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో కొనసాగుతున్నటువంటి సీతారామ ప్రాజెక్ట్ పనులను ఆయన జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే గోదావరి జలాల ద్వారా ఎక్కువ వ్యవసాయ భూములకు సాగునీరు అందించే దిశగా సీతారామ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం అందరికీ తెలిసిందేనని, త్వరగా పనులను పూర్తి చేస్తే సీతారామ కాలువ ట్రైల్ రన్‌ను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల పెండింగ్‌లో ఉన్న పనులన్నిటిని వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల్లో ఎటువంటి రాజీ పడకుండా నాణ్యత లోపం లేకుండా బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారులు వెంటనే వాటిని పరిష్కరించుకోవాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా సమన్వయంగా పని చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు సలహాలను అందించారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పీవో రాహుల్, నీటి పారుదల శాఖకు సంబంధిచిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సీతారామ ప్రాజెక్ట్ కాలువ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



-దళిత ఎస్ఐ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
-కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రెండు కోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
-దళిత ఐక్యవేదిక డిమాండ్

**ప్రజాపక్షం/సుజాతనగర్:** చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీస్ శాఖలో కుల వివక్ష వేధింపులు ఉండటం వల్లే దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని మరణించారని, మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం సుజాతనగర్ పోలీస్ స్టేషన్లో మండల దళిత ఐక్యవేదిక నాయకులు ఎస్ హెచ్ ఓకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సుజాతనగర్ మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ 25 రోజుల కిందటనే తను ఎదుర్కొన్న వివక్ష వేధింపులపై ఉన్నతాధికారులకు తెలిపారని, వారు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే దళిత ఎస్సై ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. సీఐ తో పాటు కొందరి కానిస్టేబుళ్లు వేధించిన తీరు వల్లే మనస్తాపానికి లోనయ్యి ఆత్మహత్య చేసుకున్నారని, పోలీసు శాఖలో జరుగుతున్న కుల వివక్ష వేధింపులపై ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీసుల శాఖలో ఈ వివక్ష కొనసాగితే గ్రామ సీమల్లో సాధారణ దళితుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో రోజురోజుకీ దళితుల పైన దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు రానున్న కాలంలో పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుండేటి వెంకట రాములు, వేల్పుల భాస్కర్ , మరిపిటి నగేష్, కత్తి బాలకృష్ణ, కత్తి వెంకన్న, గుండేటి రాములు, మురిపిటి మాధవరావు, కాకటి బాబు , శీల పోగు సురేష్, తడికమళ్ళ దిలీప్ , ఎర్ణం రాజు, కేసు పాక వెంకటేశ్వర్లు , కత్తి యోగేష్ , మద్దెల ప్రసాద్ , గంగపురి వెంకటేశ్వర్లు, గార్ల రవి, మురిపిటి కన్నయ్య, తోకల వెంకటేశ్వర్లు , మంద చంటి , వేల్పుల రాజు , అంకిశెట్టి రామకృష్ణ , ఈట వెంకట సాయి , దంసలపూడి పవన్, గుండేటి నరసింహారావు , విజయరాజు , భార్గవ్, జానీ, గోపి , జగదీష్ , వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రమేష్ , మురళి, రవి, ప్రసాద్, దుర్గ , గోపయ్య , నాగరాజు, రమేష్ , ప్రేమ్ ,కృష్ణ, తిరుపతయ్య, పూర్ణ పాల్గొన్నారు.

# నాటిన ప్రతీ మొక్కకు లెక్క ఉంటుంది..

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** పంచాయతీలో నాటిన ప్రతీ మొక్క కు లెక్క ఉంటుందని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య అన్నారు. మండలం లోని చెన్నారం లో నర్సరీ ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వనమహోత్సవం ను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. నాటటం ఎంతో ప్రాధాన్యత ఉందో వాటిని సంరక్షించటంలో కూడ అంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నర్సరీల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం పట్ల అప్రమతంగా ఉండాలని అన్నారు. ప్రతీ పంచాయతీ లో వనమహోత్సవం లక్ష్యం ను సాధించేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారం పంచాయతీ కార్యదర్శి నరేష్, పంచాయతీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవ కార్యక్రమాన్ని పాల్గొన్న ఎంపిపి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని అశ్వాపురం ఎంపిడివో వరప్రసాద్ ఆధ్వర్యంలో గొల్లగూడెం, మొండికుంట గ్రామ పంచాయితీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి ముత్తినేని సుజాత పాల్గొని మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపిటిసి ఫోరం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే ఖదీర్, ఎంపిటిసి కమటం నరేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏఈ విజయలక్ష్మీ , పంచాయితీ సెక్రటరీలు, నాయకులు పొడియం అనిల్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షునిగా పరమ ఇమ్మానియేట్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అఖిల భారత కిసాన్ సభ రెండవ జిల్లా మహాసభల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆళ్లపల్లి గ్రామానికి చెందిన ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా పరమ ఇమ్మానియేట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పస్య పద్మ, భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన పదవిని భాద్యతతో వ్యవహరిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు చేపడితే సమస్యల మీద రాజీలేని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

# హెచ్‌ఎం పాషా 108 రోజుల దీక్షకు సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఓల్డ్ పెన్షన్ స్కీం, టీచర్ ఎంఎల్‌సి ఎలక్షన్‌లో ఎస్‌జిటిలకు ఓటు హక్కు వీటి సాధన కోసం జాకారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేస్తున్న 108 రోజుల ఫలహార దీక్షకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆళ్లపల్లి మండల వైస్ ఎంపిపి, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాకారం హెచ్‌ఎం పాషా చేస్తున్న దీక్ష న్యాయ సమ్మతమైందని, ఈ డిమాండ్లను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. దీక్ష పూర్తయ్యేంత వరకు పాషాకు అన్ని రకాలుగా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌కే రహీం, మండల కోఆప్షన్ సభ్యులు, ఏఐటియూసి నాయకులు కొమరం హనుమంతు, మాజీ ఎంపిటిసి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పరమ ఇమ్మానుయేల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ సహాయ కార్యదర్శి కుంట సహదేవ్, ఆళ్లపల్లి మండల ఏఐటియూసి ఆటో యూనియన్ నాయకులు, పాత్రికేయులు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఎఐకెఎస్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

- సహాయ కార్యదర్శిగా బొల్లోజు వేణు

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం (ఎఐకెయస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ద్వితియ నూతన కమిటి మండల పరిధిలోని గంగోలు గ్రామం లోని వివిఆర్ పంక్షన్ హాల్లో జరిగింది. సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు ఆద్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అద్యక్షులు సంద్ర నరేంద్ర కుమార్ , జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాధం , సహాయ కార్యదర్శి బొల్లోజు వేణు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 21 మంది కార్యవర్గ సభ్యులు, 38 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్బంగా మండలానికి చెందిన బొల్లోజు వేణు మాట్లాడుతూ జిల్లా సహాయ కార్యదర్శిగా తనను ఎన్నుకోవటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. రైతుల సమస్యల పట్ల అంకిత భావంతో పని చేసి రైతుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృజ్ఞతలు తెలిపారు.

# మంత్రి సీతక్కకి జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు రామసహాయం మాధవి రెడ్డి సందర్భంగా ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు వారిని మర్యాద పూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి సాల్వ తో సత్కరించి వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపినారు. మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా శీత్లా పండుగ వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల :** బంజారాలు ఎంతోభక్తిశ్రద్ధలతో జులై మాసంలో శీత్ల పండుగను ఘనంగా నిర్వహించుకోవడం వారికి ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం మహిళలు,పురుషులు పుణ్యస్నానాలు నిర్వహించి, నూతనవస్త్రాలు ధరించి వారి ఇలవేలుపుగా కొలిచే దేవతలకు నైవేద్యాలు సమర్పించి, దేవతలకు మేకలను బలిఇచ్చి ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. అనంతరం పిల్లపాపాలు, పాడిపంటలు, చల్లగా ఉండాలని మొక్కులను చెల్లించుకుంటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోడ చిమ్నా, లక్‌పతి, జర్పుల కిషన్‌నాయక్, మహిళలు ,తదితరులుపాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫెమా కన్వీనర్ ముప్పా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తన గెలుపు కోసం పలు విద్యా సంస్థలు శ్రమించాయని ఆయన తెలిపారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తరుపున తన వంతు కృషి చేస్తానన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోడ్లు, ప్రాజెక్టులు, ఇతర అనేక అంశాలకు సంబంధించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీతారామ ద్వారా గోదావరి జలాలతో ఖమ్మంజిల్లాను సస్య శ్యామలం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యాల సంఘాల బాధ్యులు ఐవి రమణారావు, కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, వీరన్న, శశిధర్, నాసరయ్య, ప్రసాద్, సాంబశివరెడ్డి, రవి మారుత్, ఎం. వీరారెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, శేషగిరి, మధు, లింగా రెడ్డి, చౌదరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని**
**- 40 కుటుంబాలు సిపిఐలో చేరిక**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మెరుగైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ,నేటి తరం రాజకీయాలపై దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 5వ వార్డు ప్యూన్‌బస్తీకి చెందిన పవన్, రత్నాకర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో 50 మంది యువకులు, బాబు క్యాంపుకు చెందిన క్రాంతికుమార్, అరుణ, సత్యం ఇమ్రాన్, నాగిని రమేష్, వికాస్, శేఖర్ నేతృత్వంలో 40 కుటుంబాలు కూనంనేని, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు సమక్షంలో సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల్లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పిన ఎంఎల్ఏ వారికి అభినందనలు తెలిపారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ యువత అసాంఘిక శక్తుల వైపు ఆకర్షితులైతే దేశానికి ప్రమాదమని, అందుకే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిపిఐ అనుబంధ, ప్రజా సంఘాలు, యువజన సంఘంలో బాధ్యతలు తీసుకుని ప్రజలకు సేవ చేయడం ద్వారా, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడం ద్వారా పార్టీని మరింత విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, మాజీ ఉప సర్పంచ్‌లు పొలమూరి శ్రీను, యండ్ర మహేష్, ముల్లోజు వెంకట్, అల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

## సీతారామ స్టేజ్ 2 పనులపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సీతారామ ప్రాజెక్టు పూర్తికి మిగిలిన భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీతారామ ప్రాజెక్టు స్టేజ్ 2 పనుల పురోగతిపై కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు, ఎన్నెస్పి లింక్ కెనాల్‌కు ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయి ఎగ్జిక్యూటివ్ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి మిగిలిన భూ సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇంకా భూ సేకరణ చేయాల్సిన రైతులతో సంధి చర్చలు జరపాలన్నారు. కాలువ ఏర్పాటుతో రైతుల భూముల విలువ పెరుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. 75 శాతం కంటే ఎక్కువ భూమిని కోల్పోతున్న రైతులు సాగుకు మిగిలిన భూమి అక్కరకు రాకపోతే అట్టి భూమిని సేకరణ చేయాలన్నారు. భూ సేకరణలో భూములతో పాటు నిర్మాణాలు, పైపులైన్లు, షెడ్లు, చెట్లు తదితర అన్నింటి విలువ చూపాలన్నారు. భూములు ఇచ్చిన రైతులకు గిరి వికాసం తదితర ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యతనివ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాలువ నిర్మాణంలో గ్యాస్ పైప్‌లైన్ దగ్గర కాలువ ఏర్పాటుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత గ్యాస్ కంపెనీ ఇంజనీర్ల సహకారం తీసుకుని బాక్స్ టన్నెల్ నిర్మాణం చేయాలన్నారు. పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, ఇరిగేషన్ ఇఇ అర్జున్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ భూ సేకరణ సూపరింటెండెంట్ మీనన్, ఏన్కూరు తహసీల్దార్ శేషగిరిరావు, ఉద్యానవన అధికారి వేణు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కుండపోత వాన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అల్పపీడన ద్రోని కారణంగా జిల్లాలో కుండపోత వాన కురుస్తోంది. రాగల 48 గంటల్లో ఇదే తరహాలో ఉరుములు, పెరుపులు, ఈదురు గాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లి దిగువనున్న గోదావరినదితో పాటు కిన్నెరసానిలో కలుస్తున్నాయి. గోదావరికి కూడా కొత్తనీరు వచ్చి చేరుతోంది. మరో ప్రక్క వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. వర్షాల కారణంగా గడ్డి పెరిగడమే కాకుండా మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు సీజనల్ వ్యాధుల భయం పట్టుకుంది. కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ సూచిస్తోంది.

# గుండె జబ్బు బాధితురాలికి వితరణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం కప్పల బంధం గ్రామానికి చెందిన మంచాల చిన్న బుద్దయ్య కుమార్తె దుర్గా గత కొన్ని నెలలుగా గుండె జబ్బుతో బాధపడుతుండటంతో బీరవల్లి మాధవ్ ఆధ్వర్యంలో కప్పలబంధం మై విలేజ్ అనే గ్రూపు సభ్యులతో ఏకమై విద్యార్థులు యువత, ఉద్యోగస్తులు, గ్రామస్తులు కలిసి బాధితురాలికి పది వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ స్నేహితులు పాల్గొన్నారు

# ఏడోరోజుకు చేరిన న్యాయవాదుల రిలే దీక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదుల దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం దీక్షలో సీనియర్ న్యాయవాది వడ్డెల్లి కృష్ణమూర్తి, వంజాకు లక్ష్మి నారాయణ, చేకూరి ముక్తేశ్వర్, రెంటాల ఆనంద్, కెవిఎం రావు, చంద్రశేఖర్, నజీమ్ తదితరులు కూర్చున్నారు. ఈ దీక్షలకు ఐఎంఏ కమిటీ వైద్యులు యలమంచిలి రవీంద్రనాథ్, హరిప్రసాద్, కొల్లు అనుదీప్, నారాయణ, కూరపాటి ప్రదీప్, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు పోట్ల మాధవరావు, నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ మెంబరు కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, చింతనిప్పు వెంకట్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

# ఘనంగా సీత్లా భవాని వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సీత్లా భవాని వేడుకలను రఘునాథపాలెం మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పలు గ్రామాల్లో సీత్లా భవాని పండుగ వేడుకలను గిరిజనులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఏడాదికి ఒకసారి జరుపుకునే ఈ వేడుకల్లో వివిధ ప్రాంతాలలో ఉండే గిరిజనులు తమ తండాలకు తరలివచ్చి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. పంటలు బాగా పండాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని సీత్లా మాతకు పూజ చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాపటపల్లి గ్రామంలో జరిగిన సీత్లా భవాని వేడుకల్లో ఎంపిపి భూక్యా గౌరి, గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యదర్శి బోడా వీరన్న, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, లాలు, బోడా రమేష్, భాస్కర్, శంకర్, రామకృష్ణ, రాంబాబు, వినయ్, శ్రీను, వీరన్న, భాస్కర్, లాల్ సింగ్, రాములు, రామ్మూర్తి, భద్రు, సత్రు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ

**-మంత్రి వర్గ ఉప సంఘ ఛైర్మన్ భట్టి ఆధ్వర్యంలో మంత్రుల పర్యటనలు**
**-ఉమ్మడి 10 జిల్లాల్లో వర్క్‌షాపులు -నేడు ఖమ్మం జిల్లాలో వర్క్‌షాప్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు విధి విధానాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఛైర్మన్‌గా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఈనెల 10వ తేదీ నుంచి 23 వరకు పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలలో పర్యటించనుంది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ పథకానికి సంబంధించి అన్ని జిల్లాల్లో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను వినాలని మంత్రి వర్గం నిర్ణయించింది. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచే రైతు భరోసాకు నిధులు చెల్లిస్తాం అందుకే ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించింది. పాత 10 జిల్లాల్లో వర్క్‌షాపుల ద్వారా ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి సమగ్ర నివేదికను మంత్రుల ఉప సంఘం అందజేయనుంది.

**నేడు ఖమ్మంలో రైతు భరోసా వర్క్‌షాప్...**

ఖమ్మం కలెక్టరేట్‌లో రైతు భరోసా జిల్లా స్థాయి వర్క్ షాప్ బుధవారం జరగనుంది. ఈ వర్క్‌షాపుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు పాల్గొననున్నారు. ఈ వర్క్‌షాపులో రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు.

# గ్యాస్, విద్యుత్, జీరో బిల్లులకు ఎడిట్ ఆప్షన్ కల్పించాలి

**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తుదారులందరికీ అర్హులందరికీ గ్యాస్ సబ్సిడీ, విద్యుత్ లో జీరో బిల్లు కు ఎడిట్ ఆప్షన్ లు కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో చంద్రశేఖర్ కు వినతిపత్రం సమర్పించారు. గత కొద్ది నెలలుగా తమకు సబ్సిడీ కావాలని, జీరో బిల్ అవకాశం కల్పించాలని కోరుతూ ప్రజా పాలనలో పేదలు దరఖాస్తులు చేసుకున్నారు. దానిలో భాగంగా అందరకు అవకాశం రాక ఇబ్బందులు పడుతూ ఉండటంతో పేదలు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఎడిట్ ఆప్షన్ కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐమండల కార్యదర్శి దామల దయాకర్ రావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

**ప్రజాపక్షం/ మధిర :** మధ్యాహ్న భోజన వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు శీలం నర్సింహారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనిఫాం ఇవ్వాలని, వంట సామాగ్రి, గ్యాస్ ప్రభుత్వమే అందించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.